క్లుప్తంగా

నాగోబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎంపీ తనయుడు వెంకటేశ్ దంపతులు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ తనయుడు వెంకటేశ్ దంపతులు మంగళవారం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారిని మెస్రం వంశీయులు సన్మానించారు. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ పూజారి మెస్రం శేక్‌నాథ్, గ్రామస్తులు తొడసం నాగోరావ్, కోట్నాక్ కోసేరావ్ తదితరులు ఉన్నారు.

మేరిలైఫ్‌పై అవగాహన కార్యక్రమం



ఔషధ మొక్కలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేరిలైఫ్‌పై పట్టణంలోని సుందరయ్య నగర్–1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేరిలైఫ్‌లో భాగంగా చిరు ధాన్యాలు, నీరు, విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం స్వచ్ఛత, సురక్షితమైన తాగునీరు, ఇంటి పెరటి ఆవరణలో ఔషధ మొక్కలు పెంచడం తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించి వాటిని ప్రజలందరు ఆహారంలో భాగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాటీ టీచర్ రాధ, సూపర్‌వైజర్ ఫర్హా, ఆర్‌పీ ఫరీదా, కౌన్సిలర్ సంగీత, ఎఎల్‌ఎంఎస్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

‘పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా’



ఆనంద్‌రావ్

ఆదిలాబాద్‌రూరల్: గోండు సామాజికవర్గానికి చెందిన తనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే రాబోయే ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావ్ తెలిపారు. మండలంలోని లోహర గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో గోండు సామాజికవర్గం ఓటర్లు అధికంగా ఉన్నారని అన్నారు. అందుకోసం అవకాశం కల్పించాలని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లానని అన్నారు.

ఓటర్ల జాబితా సరిచేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ఇంటింటికీ బీఎల్‌వోలు తిరుగుతూ ఓటర్ల జాబితా సరిచేసుకోవాలని ఆర్డీవో రమేశ్ రాథోడ్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో మండలంలోని బీఎల్‌వో, వీఆర్‌ఏలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు ఉన్నవారి పేర్లు ఓటరు జాబితాలో చేర్పించాలన్నారు. జాబితాలో ఉండి మరణించిన వారి పేర్లు తొలగించాలన్నారు. ఇంటి నంబర్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పుడు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శివరాజ్, డిప్యూటీ తహసీల్దార్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలి




అవగాహన కల్పిస్తున్న ఏఈవో సంధ్యారాణి

ఇచ్చోడ: రైతులు నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలని ఏఈవో సంధ్యారాణి పేర్కొన్నారు. మండలంలోని ముఖరా(బి) గ్రామంలో విత్తనాలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ దుకాణాల్లో కొనుగోళ్లు చేసిన విత్తనాలకు రైతులు రసీదు తీసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురిశాకే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. సర్పంచ్ అడవ్ మారుతి, ఉప సర్పంచ్ శివాజీ, సహకార సంఘం సీఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా తవ్వకాలు

- పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణ కోసం..
- పెన్‌గంగ నుంచి ఇసుక, మట్టి
- టిప్పర్లలో తరలిస్తున్న కాంట్రాక్టర్



కళావిహీనంగా కనిపిస్తున్న పెన్‌గంగ నది



పెన్‌గంగ నదిఒడ్డున కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె) శివారులో ప్రవహిస్తున్న పెన్‌గంగ నదిలో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక, మట్టిని టిప్పర్లలో పెద్దఎత్తున తరలిస్తున్నారు. భీంపూర్ మండలంలో పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణానికి పెద్దఎత్తున మట్టి అవసరం ఏర్పడింది. సంబంధిత కాంట్రాక్టర్.. మార్కగూడ, అందర్‌బంద్, భీంపూర్ శివారులోని గుట్టలు తవ్విస్తూ, పెన్‌గంగ నది ఒడ్డు నుంచి మట్టి, ఇసుకను పెద్దఎత్తున టిప్పర్లలో తరలిస్తున్నారు. తాంసి(కె) శివారులోని పెన్‌గంగ నదికి ఇరువైపులా పెద్దఎత్తున చేపట్టిన తవ్వకాలతో నది రూపురేఖలు మారిపోయాయి. పచ్చనిచెట్లతో ఉండాల్సిన నది ఒడ్డు ప్రస్తుతం కళావిహీనంగా కనిపిస్తుంది. తవ్వకాలతో నదిఒడ్డు కనుమరుగైంది. వర్షాకాలంలో వచ్చే వరదప్రవాహం వస్తే దిశను మార్చుకుని పంట చేల వైపు నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెన్‌గంగ నదితోపాటు చుట్టుపక్కల గ్రామాల శివారులో నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబుల అడ్డా

- బోథ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల
- రాత్రివేళలో వీరంగం
- తాగిపడేస్తున్న బీర్లు, సిగరేట్లు
- వాకర్స్‌కు ఇబ్బందులు



పగులగొట్టిన బీరు సీసాలను పరిశీలిస్తున్న సర్పంచ్

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, గ్రౌండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళ మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. తాగి పడేసిన బీర్‌సీసాలను పగులగొడుతున్నారు. మూత్రవిసర్జన చేయడంతో కంపు వస్తుంది. ఉదయం నడక కోసం వచ్చే వాకర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కళాశాల ఆనుకోని పోలీస్‌స్టేషన్ ఉన్నా ఇంత తతంగం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రతిరోజు పెట్రోలింగ్ చేయడం లేదని పలువురు పేర్కొంటున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో కళాశాలలో ఎవరూ ఉండకపోవడంతో మందుబాబులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. గంజాయి సైతం సేవిస్తున్నట్లు సమాచారం. యువకులే మద్యం తాగుతున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు సిగరెట్లు లభ్యమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం



కళాశాలలో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటాం. వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించాం.

– రవీందర్, ఎస్సై, బోథ్

పెట్రోలింగ్ నిర్వహించాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మందుబాబులకు బార్‌గా మారింది. పోలీసులు ప్రతి రోజు కళాశాలలో పెట్రోలింగ్ నిర్వహించాలి.

– సుమేర్ పాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

లైటింగ్‌ను ఏర్పాటు చేస్తాం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైటింగ్ ఏర్పాటు చేస్తాం. రాత్రివేళల్లో మద్యం తాగి, బాటిళ్లకు పగులకొడుతున్నారు. వారిపై కేసులు నమోదు చేయిస్తాం.– సురేందర్, సర్పంచ్, బోథ్

మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్త

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌అర్బన్: మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రిమ్స్ ఆస్పత్రిలో రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అదే విధంగా కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో పలువురు కౌన్సిలర్లు, కార్యకర్తలు పండ్లు పంపిణీ చేయడంతో పాటు వృద్ధులతో కలిసి కేక్ కట్ చేశారు. జనార్దన్ గార్డెన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న కేక్ కట్ చేయగా పరస్పరం తినిపించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ప్రశాంత్, ఇమ్రాన్, రవి, చంద్రకాంత్, శ్రీను, శివకుమార్, సాయి, ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గర్భిణులకు వైద్యపరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ధనోరా ఉపకేంద్రం పరిధిలోని 16 మంది గర్భిణులకు వైద్యాధికారి నిఖిల్ రాజ్ రక్త, బీపీ పరీక్షలు చేశారు. న్యూట్రీషియన్ కిట్లు, మందులు అందజేశారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, స్టాఫ్‌నర్స్ ప్రవీణ, సిబ్బంది ప్రియాంక, సంధ్యారాణి ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు టీటీటీ.టఋూఛీ ఋజౌ ట ఛొూఋ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నిత్యావసరాలు అందజేత

తలమడుగు: బ్లూభీమ్ యూత్ సేవలు అభినందనీయమని ఎస్సై అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో గల బ్లూ భీమ్ యూత్ ఆధ్వర్యంలో వృద్ధులకు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. యూత్ సభ్యులు ప్రేమేందర్, శేఖర్, అరవింద్, ప్రసాద్, గోపి, రూపేందర్, సురేష్, సంతోష్, రాములు, వినోద్, గంగన్న, పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న కొనుగోళ్లు

బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు ఈనెల 25తో ముగియనున్నాయని సెంటర్ ఇన్‌చార్జి బారె నాగభూషణ్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటను 25 వరకు మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు.

రిమ్స్‌లో అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: తలసేమియా వెల్ఫేర్ సొసైటీ, స్మైల్ సొసైటీల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆవరణలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ తలసేమియా సొసైటీ స్టేట్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ రఫీ సోదరుడు మహ్మద్ అజ్జు వర్ధంతిని పురస్కరించుకొని పేదలు, నిస్సహాయులకు అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు. సొసైటీ ప్రతినిధులు మహ్మద్ రఫీ, భూరె సురేష్, రామకృష్ణ, విశాల్, నిజార్, ఇర్ఫాన్, దానిష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

- ఎమ్మెల్యే జోగు రామన్న



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: అన్నివర్గాలకు సమన్యాయం చేస్తూ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రూ.35 లక్షలతో నిర్మించనున్న జమియతే ఉల్మా హింద్ భవన నిర్మాణ పనులను మంగళవారం సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఇందుకుగాను ప్రత్యేక అభివృద్ధి ఫండ్ కింద దాదాపు రూ.251 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు మోబిన్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరికొండ: క్షీరాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు



బేలలో మిఠాయిలు తినిపిస్తున్న రాక్రే గంభీర్



జైనథ్: స్వీట్ తినిపిస్తున్న జెడ్పీటీసీ అరుంధతి



తలమడుగు: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీవో, జేపీఎస్‌లు

బేల/జైనథ్/నేరడిగొండ/సిరికొండ/తలమడుగు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంగళవారం పలుచోట్ల సంబురాలు జరుపుకున్నారు. బేల ఎంపీడీవో, జైనథ్, నేరడిగొండ, సిరికొండ మండలాల పరిషత్ కార్యాలయాల ఎదుట జేపీఎస్‌లు, బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. జైనథ్‌లో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, కార్యదర్శులకు స్వీట్లు తినిపించారు. తలమడుగు మండలం లింగి గ్రామంలో సాయి వృద్ధాశ్రమంలో జేపీఎస్‌లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాక్రే గంభీర్, యూత్ నాయకులు సతీశ్‌పవార్, నేరడిగొండ ఎంపీపీ రాథోడ్ సజన్, జెడ్పీటీసీ అనిల్ జాదవ్, సిరికొండ మాజీ సర్పంచ్ పెంటన్న, ఎంపీవో దిలీప్, అనిల్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

సిరికొండ: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరూ పాటించాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో డీపీవో మాట్లాడారు. రోడ్లపై చెత్తను వేయొద్దన్నారు. రోడ్లపై, డ్రెయినేజీల్లో చెత్త, ప్లాస్టిక్ వేస్తే జరిమానా విధించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా ప్రతి వ్యాపారి లైసెన్స్ పొందాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంపీడీవో సురేష్, ఎంపీవో హతుల్ కుమార్, మాజీ సర్పంచ్ ఓరగంటి పెంటన్న, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- గంటలోపే ముగించిన వైనం
- 8 శాఖల అధికారులు గైర్హాజరు

జైనథ్: ఎప్పుడు బీజేపీ, కాంగ్రెస్ ఎంపీటీసీలు, సర్పంచ్‌ల నిరసనలు, ఆందోళనలతో అట్టుడుకిపోయే మండల సర్వసభ్య సమావేశం ఈసారి సాదాసీదా సాగింది. గంటలోపే ముగించారు. మండల కేంద్రంలో రైతువేదికలో మంగళవార నిర్వహించిన ఈ సమావేశాన్ని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అనుమతితో ఎంపీడీవో గజానన్‌రావ్ ప్రారంభించారు. మొత్తం 21 శాఖలకు గాను 8 శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో 13 శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



పోలింగ్ బూత్ వద్ద చిత్రీకరించిన పువ్వు గుర్తుతో పార్టీ నాయకులు

నేరడిగొండ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పార్టీ మండల ఇన్‌చార్జి మాధవరావు ఆమ్టే అన్నారు. మండలంలోని నారాయణపూర్ పంచాయతీ ధార్మికనగర్, వాంకిడితోపాటు ఆయా పోలింగ్ బూత్‌లలో మంగళవారం పువ్వు గుర్తును చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్..సబ్‌కా ప్రయాస్..సబ్‌కా విశ్వాస్ అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి జాదవ్ పరుశురాం, మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, పోలింగ్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల్లో గత పది రోజుల నుంచి నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ ముగింపు పోటీలకు మంగళవారం ఆయన హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతీ మండల కేంద్రంలో సీఎం కప్ కీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. ఇచ్చోడలో స్టేడియం నిర్మాణం కోసం సీఎం కేసీఆర్, మంత్రి ఐకేరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రీమియం లీగ్‌లో గెలుపొందిన జట్టుకు రూ 15 వేల నగదుతోపాటు షీల్డు అందజేశారు. ద్వితీయ జట్టుకు రూ 7 వేల నగదు, షీల్డు, తృతీయ జట్టుకు రూ.5 వేల నగదుతోపాటు షీల్డు అందజేశారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, శాంతపూర్ సర్పంచ్ తిరుమల్‌గౌడ్, ఎంపీటీసీ జాహెద్, వార్డు సభ్యులు సాబీర్, ప్రీమియం లీగ్ క్రికెట్ నిర్వాహకులు ఆత్మరాం, సాయిరాం పాల్గొన్నారు.

‘డబుల్ బెడ్రూం హామీ ఏమైంది?’



ప్రజలతో మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

బేల: డబుల్ బెడ్రూంల కోసం బీఆర్ఎస్ నాయకులు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆరోపించారు. మండలంలోని షంషాబాద్ గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షంషాబాద్ గ్రామానికి 50 డబుల్ బెడ్రూం మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఎమ్మెల్యే జోగు రామన్నను ప్రశ్నించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదని, ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదన్నారు. డబుల్ బెడ్రూంలకు డబ్బులు వసూళ్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, ప్రధాన కార్యదర్శి రాక్రే సందీప్, నాయకులు కోడే ప్రదీప్, దీపక్, ధర్నే జీవన్, సతీశ్‌రెడ్డి, రవీంద్ర తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

బోథ్: మండంలంలోని సొనాల గ్రామానికి చెందిన గాండ్ల నారాయణ తల్లి ఇటీవల మృతిచెందింది. మంగళవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంతోష్ కుటుంబాన్ని ఓదార్చారు. సర్పంచ్ సదానందం, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్ బిన్ సలాం, బోథ్ సర్పంచ్ సురేందర్, ఎల్క రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ సంజీవ్, రమణగౌడ్, రమేశ్, నరేందర్ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు అగ్గిమల్ల గణేశ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయనను దుర్గం ట్రస్ట్ చైర్మన్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ జిల్లా చైర్మన్ దుర్గం శేఖర్, పలువురు దళిత సంఘాల నాయకులు మంగళవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. శైలేందర్ వాగ్మారే, జాడి రాజారెడ్డి, దుర్గం వెంకట నారాయణ ఉన్నారు.

పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులందరికీ పింఛన్ ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, బీడీ కార్మికులు

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం పీఎఫ్ ఉన్న ప్రతి బీడీ కార్మికులందరికీ పింఛన్ రూ.2016 అందించాలని ఏఐటీయూసీ బీడీ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.గోవర్ధన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అతికొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కట్‌ఆఫ్ తేదీతో సంబంధం లేకుండా పింఛన్ ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోదావరి, సిరిపురం దాస్, భోజన్న, షాకీర్, సుమేర్, ఖాజీమొద్దీన్, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు రక్షణ ఏదీ?



బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇక్కడ పంటలకు రక్షణ లేకుండా పోతోంది. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మంగళవారం రైతులు తెచ్చిన పంటను ఆవులు తిన్నాయి. వారు గమనించి వాటిని వెళ్లగొట్టారు.